www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:82 THURSDAY , AUGUST 06, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 82 గురువారం 06 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-




## ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పిన మెటా సీఈఓ జుకర్‌బర్గ్




### ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు తొలగింపు వ్యవహారం పై మెటా దిగొచ్చింది

హంసకలం వార్త: ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది. చిన్నారుల పై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ (CSAM), డీప్‌ఫేక్‌ల వ్యాప్తి, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన తప్పిదాలపై మెటా విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేసేందుకు భారీగా డబ్బులు తీసుకున్నట్లు మెటా బృందం అంగీకరించిందని కొన్ని వర్గాలు తెలిపినట్లు పీటీఐ కథనం పేర్కొంది వివరాలు2లో




### విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారు: ఉదయనిధి స్టాలిన్

హంసకలంవార్త: తమిళనాడు ప్రతిపక్ష నేత, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ తన అరెస్టు పై మరోసారి విమర్శలు చేశారు. తన అరెస్టు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో జరిగిందని, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇలా చేశారని ఆరోపించారు. వివరాలు2లో

## సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు

### ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్



ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్

రూ.1 లక్ష పూచీకత్తుతో పాటు పలు షరతులు విధించిన ఏసీబీ కోర్టు

యూకే, అమెరికా, జర్మనీ, చైనా పర్యటనకు గ్రీన్ సిగ్నల్

సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వాలని ఆదేశం

హంసకలం వార్త : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారిక పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, పలు షరతులతో ఆయన విదేశీ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 3న జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించవచ్చు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. వివరాలు2లో

### చంద్రుడిని ఢీకొన్న 4 టన్నుల బరువు ఉన్న స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం!


మిగతా2లో

హంసకలం వార్త :అంతరిక్షంలో ఓ కీలక ఘటన చోటుచేసుకు న్నట్లు తెలుస్తోంది. సుమారు 4 టన్నుల బరువున్న 'స్పేస్‌ఎక్స్' ఫాల్కన్-9 రాకెట్‌కు చెందిన పైభాగపు శకలం చంద్రుడిని ఢీకొన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనివల్ల భూమికి ఎటువంటి ప్రమాదం లేనప్పటికీ, చంద్రుడి ఉపరితలంపై మాత్రం భారీ గుంత ఏర్పడి ఉంటుందని నిపుణులు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం గత ఏడాది జనవరిలో చంద్రుడిపైకి ల్యాండర్లను మోసుకెళ్లిన ఫాల్కన్-9 రాకెట్‌కు సంబంధించిన సెకండ్ స్టేజ్ శకలం నిర్దేశిత కక్ష్య నుంచి పక్కకు తప్పుకుంది.



### విదేశీ మీడియాపై పాకిస్థాన్ ఆంక్షలు.. వార్తల కవరేజీకి ఇక ఎన్ఓసీ తప్పనిసరి

హంసకలం వార్త:ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (POK)లో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో విదేశీ మీడియాపై పాకిస్థాన్ ప్రభుత్వం కొత్త ఆంక్షలు విధించింది. ఇకపై విదేశీ వార్తా సంస్థలకు చెందిన పాత్రికేయులు ఇస్లామాబాద్, లాహోర్, కరాచీ వంటి ప్రధాన నగరాల వెలుపల వార్తల సేకరణకు వెళ్లాలంటే 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. వివరాలు 2లో

## సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా

### హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

సమ్మక్క సాగర్ నీళ్లను ఏపీకి ధారాదత్తం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధపడిందన్న హరీశ్

దీనిపై రేవంత్ నోరు విప్పాలని డిమాండ్

తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపాటు



హంసకలం వార్త:కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క-సారక్క (సమ్మక్క సాగర్) ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేసేం దుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం మిగతా2లో

### మణికొండలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద ఆందోళన

హంసకలం వార్త:మణికొండ బీఆర్ఎస్ మహిళా వింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల రూపారెడ్డి ఇంటి వద్ద పలువురు బాధితులు ఆందోళన చేపట్టారు. చిన్నాచితక వ్యాపారుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేశారంటూ ఆరోపించారు. తిరుమల హిల్స్‌లోని రూపారెడ్డి నివాసానికి బాధితులు చేరుకున్నారు.



### తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్.. డయల్ 112తో అన్ని సేవలు

- ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు
- హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ
- కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం
- సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు
- ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో
- అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి

4




### ఇంటర్ కాలేజీల ఫోర్జరీ కేసు.. ఫైర్ డీజీ సంతకాలు కూడా ఫోర్జరీ!


2

- హైడ్రా కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన 8 కాలేజీలు
- మాజీ ఫైర్ డీజీ నాగిరెడ్డి సంతకాలను కూడా ఫోర్జరీ చేసిన కాలేజీలు
- ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న నాగిరెడ్డి

### ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు: సంపత్ కుమార్



హంసకలం వార్త బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. 2లో

## పార్కింగ్ అడ్డాగా హైదరాబాద్- శ్రీశైలం హైవే

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



హంసకలం వార్త మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. బస్టాండ్ ఎదుట అచ్చంపేట, శ్రీశైలం వెళ్లే ప్రధాన మార్గంలో వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ద్విచక్రవాహనాలు దుకాణాల ఎదుట రోడ్డు మధ్యలో నిలుపుతుండడంతో మిగతా2లో



### గంజాయి చాక్లెట్ల విక్రయం.. బిహార్‌కు చెందిన రంజిత్ కుమాం అరెస్ట్

హంసకలం వార్త: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా 2లో

# చంద్రుడిని ఢీకొన్న 4 టన్నుల బరువు ఉన్న స్పేస్ఎక్స్ రాకెట్ శకలం!

సూర్య కిరణాలు (Solar activity), గురుత్వాకర్షణ శక్తి ప్రభావాల కారణంగా ఈ శకలం క్రమంగా తన మార్గాన్ని మార్చుకుని చంద్రుడిని సమీపించిందని స్పేస్ఎక్స్ వర్గాలు వెల్లడించాయి. ఇది గంటకు సుమారు 8,690 కిలోమీటర్ల (5,400 మైళ్ళు) వేగంతో చంద్రుడి ఉత్తర గోళార్ధంలోని ఐన్‌స్టీన్ క్రెటర్ సమీపంలో జాబిల్లిని ఢీకొన్నట్లు అంచనా వేశారు. ఈ అనూహ్య పరిణామంపై నాసా తో పాటు పలు అంతరిక్ష పరిశోధనా సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. నాసాకు చెందిన 'ల్యూనార్ రికాన్సజెన్స్ ఆర్బిటర్' (LRO) ప్రోబ్, సౌత్ కొరియాకు చెందిన 'పాత్‌ఫైండర్' ఆర్బిటర్లు.. శకలం పడిన ప్రాంతాన్ని ఫొటోలు తీసేందుకు సన్నద్ధమయ్యాయి.

రాకెట్ శకలం చంద్రుడిని ఢీకొట్టిన కారణంగా ఏర్పడే ధూళి మేఘాలు, శిథిలాలను అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో జాబిల్లిపై మానవ నివాసాలు ఏర్పాటు చేసే ప్రణాళికలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 17,000 టన్నుల బరువున్న 46,000లకు పైగా అంతరిక్ష వ్యర్థాలు తిరుగుతున్నట్లు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ESA) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యర్థాలు రోజురోజుకూ పెరిగిపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, ఈ ఘటన అంతరిక్ష ప్రయోగాల్లో వ్యర్థాల తొలగింపు, పర్యవేక్షణపై మరోసారి ఆలోచన రేకెత్తిస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్



ఆగస్టు 3న జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించవచ్చు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. పర్యటన ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే వివరాలను కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి రాజకీయపరమైన అనుమతి పొందాలని, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక 2026 సెప్టెంబర్ 18 లోగా తన పాస్‌పోర్ట్‌ను తిరిగి కోర్టులో జమ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. 2015లో నమోదైన ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మొదటి నిందితుడిగా (ఏ1) ఉన్నారు. అప్పట్లో ఆయన టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై 2015 మే 31న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు జైలులో ఉన్న రేవంత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టుకు అప్పగించారు. విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఏసీబీ కోర్టు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అప్పట్లో హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో రేవంత్ రెడ్డి, ఇతరులపై ఏసీబీ అధికారులు అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర (ఐపీసీ 120బీ) కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. తనపై ఉన్న ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ దశలో ఉంది.

# ఇంటర్ కాలేజీల ఫోర్జరీ కేసు.. ఫైర్ డీజీ సంతకాలు కూడా ఫోర్జరీ!

హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ కళాశాలల నకిలీ ఎన్ఓసీల స్కామ్‌లో మరో కొత్త నిజం వెలుగులోకి వచ్చింది. ఇంటర్ బోర్డు అఫిలియేషన్ పొందేందుకు 8 కాలేజీలు 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ సంతకాలను ఫోర్జరీ చేసిన ఉదంతం కలకలం రేపుతు ండగానే... మరోవైపు, సరిగ్గా అదే బాటలో మరికొ న్ని కాలేజీలు అగ్నిమాపక శాఖ మాజీ డీజీ నాగిరెడ్డి సంతకాలను కూడా ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న నాగిరెడ్డి స్థానంలో వేరే అధికారులు బాధ్యతలు (ఫైర్ డీజీ) చేపట్టినప్పటికీ... సదరు కాలేజీల యాజమాన్యాలు పాత డీజీ నాగిరెడ్డి పేరుతో నకిలీ ఫైర్ ఎన్ఓసీ పత్రాలను సృష్టించి ఇంటర్ బోర్డుకు సమర్పించా యి. నాగిరెడ్డి అగ్నిమాపక శాఖలో లేకపోయినా ఆయన సంతకాలతో సర్టిఫికెట్లు రావడంపై అను మానం వచ్చిన అధికారులు అసలు విషయాన్ని బయటకు తీశారు. దీనిపై విచారణ జరపగా, నాగిరెడ్డి పేరుతో ఫోర్జరీ సంతకాలు చేసి దొంగ ఎన్ఓసీలు తయారు చేసిన వ్యవహారం బయటపడింది. మొత్తం 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలు నాగిరెడ్డి పేరుతో ఈ నకిలీ ఎన్ఓసీల అక్రమానికి పాల్పడినట్లు అధికారులు తేల్చారు.

# సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?: హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయని... దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. తమ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సమ్మక్క సాగర్ 47 టీఎంసీల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కేంద్ర అనుమతులు తీసుకొచ్చామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆఖరికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఫలాలను అందించే ఈ నీటి కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వదులుకుంటుందని ప్రశ్నించారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేలా కేంద్రానికి లేఖలు రాయడమే కాకుండా బోర్డు సమావేశాల్లో పాత అనుమతులను రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని, జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబును ఈ సందర్భంగా హెచ్చరించారు.

# పార్కింగ్ అడ్డాగా హైదరాబాద్- శ్రీశైలం హైవే

ఒక వైపు చిరు వ్యాపారుల బండ్లు, మరోవైపు ప్రయాణికుల కోసం నిలుపుతున్న ఆటోలు, ఆపై ద్విచక్రవాహనాలు నిలుపుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బస్టాండ్ నుంచి బస్సులు మళ్లే ప్రధాన ద్వారా ఎదుట వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నెలల కాలంగా పరిస్థితి ఈ విధంగానే ఉంటున్నా ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావినిస్తోంది ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారి మీదుగా నిత్యం శ్రీశైలం, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్ కర్నూల్ ప్రాంతాలకు వందల వాహనాలు, వేల మంది ప్రయాణికులు రాకపోకలకు సాగిస్తుంటారు. దుకాణాలు, హోటళ్లకు వచ్చే కొనుగోలు దారులు షాపుల ఎదుట ఎక్కడపడితే అక్కడ గంటల తరబడి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పట్టించుకునే వారులేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల వాహన దారులు కూడా పట్టణానికి వచ్చి దుకాణాల ఎదుటే పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల తీరు పై ప్రయాణికులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ లోపం గూర్చి మంగళవారం పలువురు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

# గంజాయి చాక్లెట్ల విక్రయం.. బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్ అరెస్ట్

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా–2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా పనిచేస్తూ దుండిగల్ తండా–2లో నిందితుడు రంజిత్ కుమార్ నివాసం ఉంటునట్లు పోలీసులు వెల్లడించారు. బిహార్‌లోని తన అత్తగారి ఊరి నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. తండాలోని స్థానిక కార్మికులకు, లేబర్లకు గంజాయి చాక్లెట్లను అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు.

# ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పిన మెటా సీఈఓ జుకర్‌బర్గ్

కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేసేందుకు భారీగా డబ్బులు తీసుకున్నట్లు మెటా బృందం అంగీకరించిందని కొన్ని వర్గాలు తెలిపినట్లు పీటీఐ కథనం పేర్కొంది. ఈ వ్యవహారంపై మెటా క్షమాపణలు చెప్పడంతో పాటు తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా మెటా అంగీకరించినట్లు తెలుస్తోంది. కాగా.. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీని క్షమాపణలు చెప్పింది.

# విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారు: ఉదయనిధి స్టాలిన్

త్రిషపై వ్యాఖ్యల నేపథ్యంలో ఉధయనిధిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే. మంగళవారం హైడ్రామా తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ బుధవారం అసెంబ్లీకి హాజరయ్యారు. 'రాష్ట్రంలో కావేరి జల వివాదం, మేకేదాటు ప్రాజెక్టు, రైతుల సమస్యలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ సమయంలో నా అరెస్టు పెద్ద రాజకీయ అంశంగా మారింది. ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశం' అని ఉదయనిధి ఆరోపించారు. తన అరెస్టుపై ముఖ్యమంత్రి మౌనం వహించడాన్ని ఉదయనిధి ఎద్దేవా చేశారు . అలాగే 'నేను ద్వంద్వార్థాలు వాడానని కొందరు ఆరోపించారు. నేను ఒకే అర్థంతో మాట్లాడాను. రైతులకు నీరు కావాలి. దాని గురించే నేను మాట్లాడాను. మహిళలను అగౌరవపరిచే ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. తమిళనాడులోని ప్రతి తల్లిని, సోదరిని నేను నా సొంత కుటుంబంగా భావిస్తాను' అని ఉదయనిధి పేర్కొన్నారు.

# విదేశీ మీడియాపై పాకిస్థాన్ ఆంక్షలు.. వార్తల కవరేజీకి ఇక ఎన్ఓసీ తప్పనిసరి..

కొత్త మార్గదర్శకాల ప్రకారం, విదేశీ పాత్రికేయులు ఇకపై ప్రయాణించే ప్రాంతం, సందర్శన ఉద్దేశం, బృందం వివరాలను ముందుగానే ప్రభుత్వానికి తెలియజేసి అనుమతి పొందాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా సున్నిత ప్రాంతాల్లో వార్తల సేకరణ లేదా చిత్రీకరణ చేయడానికి వీల్లేదు. పీఓకేలో కొనసాగుతున్న ఆందోళనల సమయంలో ఈ నిబంధనలు అమల్లోకి రావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పీఓకేలో నిరసనలు, భద్రతా బలగాల చర్యలు, ఎన్నికల నిర్వహణపై అంతర్జాతీయ మీడియాలో విస్తృత కథనాలు వెలువడ్డాయి (Press Freedom Pakistan). ఈ పరిణామాల తర్వాతే విదేశీ మీడియాపై పాకిస్థాన్ ప్రభుత్వం నియంత్రణలను మరింత కఠినతరం చేసింది. ఈ చర్య పత్రికా స్వేచ్ఛకు విరుద్ధమని మీడియా సంఘాలు విమర్శిస్తున్నాయి. జాతీయ భద్రత, సున్నిత ప్రాంతాల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం పేర్కొంది.

# ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు: సంపత్ కుమార్

రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# మణికొండలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద ఆందోళన

తిరుమల హిల్స్‌లోని రూపారెడ్డి నివాసానికి బాధితులు చేరుకున్నారు. నైన్ స్టార్ హిల్స్ వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దాచుకున్న జీవితకాల పొదుపు మొత్తాన్ని పెట్టుబడి పెట్టమంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు, సంవత్సరాలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఎందుకు తిరిగి ఇవ్వలేదని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని బాధితులు స్పష్టం చేశారు. వందల సంఖ్యలో జనాలను రూపారెడ్డి నమ్మించి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. బాధితుల ఆందోళనతో మణికొండ తిరుమల హిల్స్ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# సంపాదకీయం

## పోలికల రొంపిలో పిల్లలే కాదు, పెద్దలూ!



ఒకప్పుడు పిల్లలను పక్కింటి పిల్లాడితో, క్లాస్‌మేట్‌తో, ఎక్కువలో ఎక్కువ చుట్టాల పిల్లలతో మాత్రమే పోల్చేవారు. అది కూడా అరుదుగానే, ఆ తర్వాత మర్చిపోయేవారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అరచేతిలో ఇమిడిపోయింది. నిద్ర లేవగానే మనం చూసేది ఎవరో ఒకరి విజయం, ఎవరో ఒకరి కొత్త ఇల్లు, ఎవరో ఒకరి పిల్లాడి ర్యాంకు. ఇక్కడ సమస్య పోటీ కాదు; ప్రతి క్షణం ఇతరులతో పోలికకు గురయ్యే జీవితం. కానీ ఈ నిరంతర అంచనా యాదృచ్ఛికంగా ఏర్పడటం లేదు. దాని వెనుక ఒక వ్యవస్థ పని చేస్తోంది. ఇది కేవలం 'మనం చూసేది' కాదు, ఎవరో 'మనకు చూపించేది.' సోషల్ మీడియా వేదికలు మనకు కంటెంట్‌ను తటస్థంగా చూపించవు; వాటి వెనుక ఉన్న అల్గారిథమ్‌లు ఉద్దేశపూర్వకంగా ఇటువంటి పోస్టులనే ఎక్కువగా మన ముందుకు తెస్తాయి. ఎందుకంటే అలాంటి కంటెంట్ మనల్ని ఎక్కువసేపు స్క్రీన్ మీద ఉంచుతుంది, ఎక్కువ రియాక్షన్లు తెప్పిస్తుంది. అంటే... మనం చూసేది 'మనం ఎంచుకున్నది' కాదు; వ్యాపార లాభం కోసం రూపొందించిన ఒక వ్యవస్థ దీని వెనుక ఉంది. ఈ వేదికల ప్రధాన లక్ష్యం నిజాన్ని ప్రతిబింబించడం కాదు; మన దృష్టిని వీలైనంత ఎక్కువసేపు తమ వద్ద నిలిపి ఉంచుకోవడమే. పిల్లల మనోభావాలు, తల్లిదండ్రుల ఆందోళన-- ఇవే ఆ వ్యాపార నమూనాకు ముడిసరుకు. మరో కోణం ఏంటంటే, మనం చూసేది ఎవరి జీవితంలోనైనా ఉత్తమ క్షణం మాత్రమే. ఆ ఫొటో వెనుక దాగి ఉన్న శ్రమ, ఒత్తిడి, వైఫల్యాలు కనిపించవు. కానీ మన మెదడు దాన్ని మన మామూలు, రోజువారీ జీవితంతో పోల్చేస్తుంది. వాస్తవానికి ఇది సమాన పోలిక కాదు; ఒకరి ఉత్తమ క్షణానికి, మరొకరి సాధారణ దినచర్యకు మధ్య జరిగే అసమాన పోలిక. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ ప్రచురించిన పలు సమీక్షలు... సోషల్ మీడియా వినియోగం పెరిగే కొద్దీ సామాజిక పోలికలు, ఆందోళన, ఆత్మన్యూనత భావనలు పెరగవచ్చని సూచిస్తున్నాయి. మన మెదడు సహజంగానే తనను ఇతరులతో పోల్చుకొని అంచనా వేసుకుంటుంది. సోషల్ మీడియా ఆ సహజ స్వభావాన్ని వేల రెట్లు పెంచుతుంది. నేటి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో మన దృష్టి కూడా ఒక వస్తువే. మనం ఎంత ఎక్కువసేపు స్క్రీన్ ముందుంటే, అంత ఎక్కువ ప్రకటనలు చూపించవచ్చు. అందుకే ఆశ్చర్యం, అసూయ, భయం వంటి బలమైన భావోద్వేగాలను రేకెత్తించే కంటెంట్‌కు అల్గారిథమ్‌లు ప్రాధాన్యం ఇస్తాయి. 2024లో ప్రపంచ డిజిటల్ ప్రకటనల మార్కెట్ విలువ సుమారు 700 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ ఆదాయం వినియోగదారుల దృష్టిని ఎక్కువసేపు నిలిపే వ్యాపార నమూనాపైనే ఆధారపడి ఉంది. మనం ఎంత ఎక్కువసేపు ఈ అంచనా ఒరవడిలో మునిగిపోతే, ఆ వ్యాపార నమూనాకు అంత ఎక్కువ లాభం. ఈ ఒరవడి ఇప్పుడు పిల్లలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇతర తల్లిదండ్రులు తమ పిల్లల ర్యాంకులు, అవార్డులు, విదేశీ విద్యావకాశాలు గర్వంగా పోస్టు చేస్తుంటే, ఆ ఒత్తిడి.. ముందు తల్లిదండ్రుల మనసుల్లో మొదలవుతుంది. ఆ ఆందోళన 'నువ్వు ఎందుకు అలా చేయలేక పోతున్నావు?' అనే ప్రశ్నగా పిల్లలపైకి బదిలీ అవుతుంది. తల్లిదండ్రుల ఆందోళన పిల్లలపై ఒత్తిడిగా మారుతుంది; ఆ పిల్లలు పెద్దయ్యాక తమ సొంత సోషల్ మీడియా పోలికల్లో మరింత చిక్కుకుపోతారు. అంటే పిల్లలపై పడుతున్న ఒత్తిడికి కారణం చాలాసార్లు వారి ప్రతిభ లోపం కాదు; పెద్దలు కూడా చిక్కుకున్న ఈ పోలికల సంస్కృతి. ఈ ఆందోళన గురించిగ్రంథంలో స్పష్టంగా విశ్లేషించారు. స్మార్ట్‌ఫోన్ ఆధారిత బాల్యం, సోషల్ మీడియా వినియోగం యువతలో ఆందోళన, సామాజిక పోలికలు, ఒంటరితనాన్ని పెంచుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మరి లాభాల కోసం ఈ నిరంతర అంచనా ఒరవడిని పెంచే వ్యవస్థలో, కుటుంబాలు తమ పిల్లల మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి? పాఠశాలల్లో డిజిటల్ మీడియా లిటరసీని బోధించాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో కనిపించేదంతా వాస్తవం కాదని చిన్నప్పటి నుంచే పిల్లలు అర్థం చేసుకోవాలి. పిల్లలను ఎక్కువసేపు స్క్రీన్‌కు కట్టిపడేసే డిజిటల్ వేదికలపై ఎక్కువ పారదర్శకత, బాధ్యత తీసుకురావాల్సిన అవసరం కూడా ఉంది. తల్లిదండ్రులు ముందుగా తమను తాము ప్రశ్నించుకోవాలి-- మనం ఎవరితోనైనా మన పిల్లాడిని పోల్చుతున్నామా అని. పిల్లలకు 'హైలైట్ రీల్'కు, వాస్తవ జీవితానికి మధ్య ఉన్న తేడాను వివరించాలి. ప్రతి విజయం వెనుక ఎన్నో విఫల ప్రయత్నాలు ఉంటాయని అర్థం చేసుకోవడానికి వారికి సహాయపడాలి. ఇంట్లో విజయాన్ని కేవలం ర్యాంకులతోనే కాకుండా, ప్రయత్నం, ఎదుగుదల, నేర్చుకునే తత్వంతో కొలవాలి. పిల్లల బాల్యాన్ని దెబ్బ తీస్తున్నది మార్కుల పోటీ ఒక్కటే కాదు; నిరంతరం అంచనా వేయించే డిజిటల్ సంస్కృతి. ఆ చక్రంలో చిక్కుకున్నది పిల్లలు మాత్రమే కాదు; పెద్దలూ. అందుకే, పిల్లలను మార్చడం కంటే ముందు, తామూ ఈ వ్యవస్థ ప్రభావానికి అతీతులం కాదని పెద్దలు గుర్తించడంలోనే పరిష్కారం ఉంది. ఎందుకంటే పిల్లలు మనం చెప్పేదాని కంటే, మనం ఎలా జీవిస్తున్నామో అదే ఎక్కువగా నేర్చుకుంటారు.

# కాక్రోచ్ వెనుక 'లాఫ్టివిజం' వ్యూహం!




సెర్బియా అధ్యక్షుడు స్లోబోడాన్ మిలోషెవిచ్‌ను అధికారం నుంచి తొలగించిన ఒట్పోర్ ఉద్యమం ప్రధాన నాయకుల్లో స్ర్జా పోపోవిచ్ ఒకరు. ఆయన అభిప్రాయం ప్రకారం-- తాము నిరంకుశ పాలనగా భావించే ప్రభుత్వంపై కోపాన్ని ప్రదర్శిస్తే, దానికి ప్రతిగా ఆ ప్రభుత్వం కఠిన చర్యలకు దిగే అవకాశం ఉంటుంది. కానీ పోస్టర్లు, మీమ్స్, వ్యంగ్యం, జోకులకు పాలకులు భయపడటం ప్రారంభిస్తే, అదే ప్రభుత్వం ప్రజల దృష్టిలో హాస్యాస్పదంగా, బలహీనంగా కనిపించడం మొదలవుతుంది. ఈ భావనను 'లాఫ్టివిజం' అని పోపోవిచ్ పేర్కొన్నాడు. అంటే, నవ్వును ఒక రాజకీయ ఆయుధంగా మార్చడం. 2013లో 'ఫారిన్ పాలసీ' పత్రికలో ప్రచురితమైన తన వ్యాసంలో, "డిలెమా యాక్షన్స్" అనే సిద్ధాంతాన్ని పోపోవిచ్ ప్రతిపాదించాడు. అనంతరం, తన 'బ్లూ ప్రింట్ ఫర్ రివల్యూషన్' అనే పుస్తకంలో దీనిని మరింత వివరంగా చర్చించాడు. తన రచనల్లో స్ర్జా పోపోవిచ్ చెప్పేదేమిటంటే-- 'లాఫ్టివిస్టులు' ప్రజలకు ప్రాధాన్యమున్న ఒక సమస్యను సృష్టించాలి లేదా గుర్తించాలి. ఆ తర్వాత, ప్రత్యర్థి ఒక సంకటస్థితిలో పడే విధంగా కార్యాచరణను రూపొందించాలి. అంటే-- అహింసాత్మక ఉద్యమాన్ని కొనసాగనివ్వడం లేదా ప్రజాదరణ లేని ఆంక్షలను అమలు చేయాల్సిరావడం వంటి రెండు ఎంపికల మధ్య ప్రత్యర్థిని నిలబెట్టే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వానికి "గెలిచినా ఓటమే, ఓడినా ఓటమే" అనే పరిస్థితులను సృష్టించటం, ప్రభుత్వం అంటే భయం పోగొట్టడం, మూకుమ్మడిగా ఎదిరిస్తే ప్రభుత్వాలు ఏమీ చేయలేవని నిరూపించడం, అధినేతలను మీమ్స్ ద్వారా గేలిచేయడం "లాఫ్టివిజం" కార్యాచరణలో ముఖ్యమైన అంశాలు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, దాని ప్రతికూల ప్రభావం ప్రభుత్వానికే తగిలేలా చూడాలి. ప్రభుత్వం జోకులు లేదా మీమ్‌లను పట్టించుకోకపోతే, ఉద్యమానికి ఆదరణ పెరిగి అది విస్తరిస్తుంది. మరోవైపు, ప్రభుత్వం వాటికి ఆగ్రహించి చట్టపరమైన చర్యలు తీసుకున్నా లేదా అణచివేతకు దిగినా, అదే ప్రభుత్వం అసహనంతో కూడినదిగా, పిరికిదిగా ప్రజల దృష్టిలో కనిపిస్తుంది. దీనినే 'బ్యాక్‌ఫైర్ ఎఫెక్ట్' అంటారు. సీజేపీ నిరసనల్లో జరిగిన పరిణామాలతో దీనికి ఉన్న పోలికను విస్మరించడం కష్టం. మోదీ ప్రభుత్వం మొదట సీజేపీని పట్టించుకోలేదు. అనంతరం, సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని తాత్కాలికంగా బ్లాక్ చేయాలని ఆదేశించింది. దీంతో కాక్రోచ్‌లకు వారి మొదటి విజయం లభించింది. కొద్దిరోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 20మిలియన్ల ఫాలోవర్స్‌ను సంపాదించిన సీజేపీ... ఫాలోవర్స్ పోటీలో బీజేపీని అధిగమించామని పేర్కొంది. ప్రభుత్వ నిషేధాన్ని, యువ కాక్రోచ్‌లంటే కేంద్ర ప్రభుత్వం భయపడుతున్నదనటానికి సంకేతంగా సీజేపీ చిత్రీకరించింది. తర్వాత సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీపై విధించిన ఆంక్షను తొలగించడం కూడా కేంద్ర ప్రభుత్వానికి తప్పిదంగానే మారింది. మొదట విధించిన నిషేధం ప్రభుత్వాన్ని ఎగతాళికి గురిచేస్తే, తర్వాత ఆ నిషేధాన్ని వెనక్కి తీసుకోవటం-- 'ఫాసిస్టు' ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు దిగిందని ప్రచారం చేయడానికి సీజేపీకి అవకాశం కల్పించింది. పోపోవిచ్ కార్యాచరణ నమూనాకు అనుగుణంగానే కాక్రోజ్ జనతా పార్టీ ప్రజలకు చర్చనీయాంశమైన నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశాన్ని ఉద్యమానికి ఎంచుకుంది. 2026 జూన్ మొదటి వారానికి, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ సీజేపీ నిర్వహించిన ఆన్‌లైన్ ప్రచారం, క్షేత్రస్థాయి 'అహింసాత్మక' నిరసనగా మారింది. అనేక వారాలపాటు కేంద్ర ప్రభుత్వం సీజేపీ నిరసనను కనీసం గుర్తించలేదు. అలా వదిలేస్తే ఈ 'ఉద్యమం' సహజంగానే క్రమంగా ముగుస్తుందని ప్రభుత్వం భావించి ఉండవచ్చు. అయితే, ప్రభుత్వ ఈ నిర్లక్ష్య ధోరణి సీజేపీకి తనను తాను సిద్ధం చేసుకోవడానికి, మద్దతుదారులను సమీకరించడానికి, పూర్తి శక్తితో ప్రభుత్వంపై దాడి చేయడానికి అవకాశాన్ని కల్పించింది. సీజేపీ ఎప్పుడైతే నీట్ ప్రశ్న పత్రం లీక్ అంశాన్ని తీసుకుందో పిల్లలు, పెద్దలు అందరూ దానికి కనెక్ట్ అయ్యారు. మతం, కులం, ప్రాంతం, జాతి, పార్టీలకు అతీతంగా మద్దతు లభించింది. సీజేపీ కూడా ఇంత మద్దతు లభిస్తుందని ఊహించి ఉండదు. ఇదే అదనుగా బీజేపీ వ్యతిరేక, జాతి వ్యతిరేక శక్తులు సీజేపీ వెంట నిలిచాయి.

'నీట్' అక్రమాలు బయటపడగానే ప్రభుత్వం కఠినమైన చర్యలకు ఉపక్రమించి ఉంటే సీజేపీ ఆందోళనకు ఇంత మద్దతు లభించి ఉండేది కాదు. నాడు వ్యవసాయ చట్టాలపై ఆందోళన, నేడు నీట్ అక్రమాలపై ఆందోళన రెండూ మోదీ ప్రభుత్వం మెడలు వంచాయి. ఇప్పటికైనా కొత్త తరం కొత్త రకపు నిరసన పద్ధతులను ఎంచుకొంటున్నదన్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలి. యువతరం ఆకాంక్షలకు, ఆశలకు తగ్గట్లుగా పాలనా సంస్కరణల ద్వారా పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకువచ్చేందుకు పాలకులు కృషి చేస్తారని ఆశిద్దాం.

# గాజా మారణహోమంలో మన సాయమా!?

భారత ప్రభుత్వం ఇజ్రాయెల్ రక్షణ రంగంతో ఎలా సన్నిహితమైన, లాభదాయకమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుందో, ఆ దేశ సైనిక కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే సరఫరా గొలుసులకు ఎలా ఒక ముఖ్యమైన సహకారిగా మారిందో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తాజా నివేదిక 'మేడ్ ఇన్ ఇండియా: ది సప్లయ్ ఆఫ్ వెపన్స్ అండ్ అమ్యునిషన్ టు ఇజ్రాయెల్' వివరిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేసే అక్కడి కంపెనీలకు భారతదేశం ఆయుధాలను, మందుగుండు సామగ్రిని, విడిభాగాలను, ఇతర పరికరాలను ఎలా రవాణా చేస్తున్నదో వెల్లడించడానికి ఈ నివేదిక భారత్--ఇజ్రాయెల్ దేశాల మధ్య రవాణా స్థాయి వాణిజ్య డేటాను వాడుకున్నది. నేరుగా భారత ప్రభుత్వ యాజమాన్యంలోను, నియంత్రణలోను ఉన్న కంపెనీలను కూడా ఇది గుర్తించింది.

"సంవత్సరాలుగా గాజాలో మారణహోమం జరుగుతున్నప్పటికీ, ఆ వివరాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ ప్రసారమవుతున్నప్పటికీ భారతదేశం మాత్రం ఇజ్రాయెల్ సైనిక, రక్షణ రంగానికి మద్దతు కొనసాగిస్తూనే ఉన్నదని మా పరిశోధన వెల్లడిస్తున్నది" అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కల్లమార్డ్ తెలిపారు. "ప్రధాన సప్లయ్ కంపెనీలపై తనకున్న యాజమాన్యాన్ని, నియంత్రణనూ వాడుకుని భారతదేశం ఇజ్రాయెల్‌కు ఆయుధాలను తయారు చేసి సరఫరా చేస్తోంది. అంతర్జాతీయ చట్టాలు, ప్రమాణాలకు అనుగుణంగా ప్రైవేట్ కంపెనీల ద్వారా ఇజ్రాయెల్‌కు జరిగే ఆయుధ ఎగుమతులను నియంత్రించడంలో భారతదేశం విఫలం కావడమే కాదు, పైపెచ్చు ఇజ్రాయెల్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింతగా బలపరుచుకుంది" అని ఆమె పేర్కొన్నారు. "గాజాలోని పాలస్తీనియన్లపై జాతి నిర్మూలన జరిగే ప్రమాదం ఉందన్న వాస్తవాన్ని అంతర్జాతీయ న్యాయస్థానం గుర్తిస్తూ తాత్కాలిక చర్యలకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో-- ఇజ్రాయెల్‌కు ఆయుధాల బదిలీని అనుమతిస్తూ, దాన్ని మరింత సులభతరం చేస్తున్న భారత అధికారులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నారు" అని ఆమె స్పష్టం చేశారు.



ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పరిశోధకులు 7 అక్టోబర్ 2023 మొదలుకొని భారతదేశం నుంచి ఇజ్రాయెల్‌కు రవాణా అయిన 2,596 ఆయుధాలు, మందుగుండు సామగ్రి, భాగాలు, విడిభాగాల సరుకులను విశ్లేషించారు. రికార్డుల ప్రకారం, ఇజ్రాయెల్ సైన్యానికి ప్రత్యక్ష సరఫరాదారులైన అక్కడి పెద్ద కంపెనీలకు మన భారతీయ కంపెనీలు కనీసం 3,90,516 చిన్న ఆయుధ విడిభాగాలను, 5,64,970 పేలుడు పదార్థాల భాగాలను (డ్రోన్ వార్‌హెడ్‌లు, ఫిరంగి గుండ్ల కేసింగ్‌లు వంటివి), 298 సైనిక వాహనాలకు సంబంధించిన విడిభాగాలను సరఫరా చేశాయి. దాడుల నుంచి పౌరులను రక్షించడానికి పనికివచ్చే క్షిపణి నిరోధక రక్షణ సాంకేతికత కోసం వాడే అవకాశం ఉన్న ఆయుధాలు, భాగాలు, మందుగుండు సామగ్రి సరఫరాను ఈ నివేదిక మినహాయించింది. జూన్, జూలై 2026లో, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఈ నివేదికలోని వివరాలను తెలియజేస్తూ భారత ప్రభుత్వానికి, నివేదికలో పేర్కొన్న తొమ్మిది కంపెనీలకు లేఖ రాసింది, కానీ ఎటువంటి స్పందన రాలేదు. అమెరికా, జర్మనీ వంటి అనేక కీలక దేశాల నుంచి దాదాపు నిరంతరాయంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరా కావడం, అలాగే స్లోవేనియా, ఫ్రాన్స్‌ల ద్వారా ఇజ్రాయెల్‌కు ఆయుధాలు రవాణా కావడం వంటి కారణాల వల్ల ఇజ్రాయెల్ ఈ నేరాలకు, అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనలకు పాల్పడగలిగిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నమోదు చేసింది.

"ఇజ్రాయెల్‌కు ఆయుధాల బదిలీని తెలిసి కూడా అనుమతించడం ద్వారా, జాతి నిర్మూలనను నిరోధించాల్సిన తన విధిని, జెనీవా కన్వెన్షన్‌లను గౌరవించేలా చూడాల్సిన తన బాధ్యతను భారతదేశం స్పష్టంగా ఉల్లంఘిస్తున్నది" అని ఆగ్నెస్ కల్లమార్డ్ స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ చట్టవిరుద్ధ ఆక్రమణకు, దాని నేరాలకు తాము దోహదపడటం లేదని నిరూపించుకునే వరకు సదరు కంపెనీలపై సమగ్ర ఆయుధ నిషేధాన్ని విధించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చాలా కాలంగా పిలుపునిస్తోంది. భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అందిస్తున్న ఈ సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని ఈ సంస్థ డిమాండ్ చేసింది.

# ప్రభుత్వ బడి పిల్లల కోసం ఉచిత ఉదయపు పోషకాహార కార్యక్రమం ప్రారంభం







( ఆగస్టు - 5-08-2026 హంస కలంవార్త)

స్థలం: చేవెళ్ల నియోజకవర్గం, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమంలో భాగంగా అమెజాన్ మరియు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 9,000 మందికి పైగా విద్యార్థులకు ఉచిత ఉదయపు పోషకాహార (మార్నింగ్ న్యూట్రిషన్) కార్యక్రమం ఘనంగా ప్రారం భ మైంది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, విద్యార్థుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి రోజు విద్యార్థులకు పోషక విలువలు కలిగిన అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ( డీఈవో ) వెంకటేశ్వర్లు, అమెజాన్ ప్రతినిధి క్రాంగ్ లేవైస్, తాతాజీ, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రతినిధి ఆశిష్ భారద్వాజ్, మండల విద్యాశాఖ అధికారి ( ఎం ఈ ఓ ) లక్ష్మణ్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు శాంతమ్మ-- యాదయ్య, ప్రభాకర్ రెడ్డి, నర్సింలు, సబితా గోవర్ధన్ రెడ్డి, నవనీత స్వామి, పలువురు నాయకులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు తరలిన బీసీల దండు





(ఆగస్టు 5-08-2026 హంస కలం వార్త )

ప్రత్యేక బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన జాజుల శ్రీనివాస్ గౌడ్ మా వాటా మాకు దక్కే వరకు దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తాం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేస్తాం: జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు, వాటా పూర్తిస్థాయిలో దక్కే వరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేసి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న 11వ జాతీయ ఓబీసీ మహాసభకు తెలంగాణ రాష్ట్రం నుంచి వందలాది మంది బీసీ ప్రతినిధులు ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ గన్‌పార్క్ నుంచి బెంగళూరుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రత్యేక బస్సులకు జాజుల శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో మండల్ కమిషన్ సిఫారసులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీసీలు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ, వరుస ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. పార్లమెంట్‌లో మండల్ కమిషన్ సిఫారసుల అమలును ప్రకటించిన చారిత్రాత్మకమైన ఆగస్టు 7 తేదీని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం దేశంలోని 29 రాష్ట్రాల బీసీలను ఒక వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహిసు _్నామని తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది బెంగళూరులోని సిటీ యూనివర్సిటీ జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో 11వ జాతీయ ఓబీసీ మహాసభను భారీ ఎత్తున నిర్వహిస్తు న్నట్లు వెల్లడించారు. ఈ మహా సభకు తెలంగాణ నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవు తుండగా, ఆంధ్రప్రదేశ్, కర్ణాట క, మహారాష్ట్ర, తమిళ నాడు, కేరళ, బీహార్, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఓబీసీ ప్రతినిధులు పాల్గొంటు న్నట్లు తెలిపారు. ఈ మహాసభ దేశవ్యాప్తంగా బీసీల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, సామాజిక న్యాయం సాధనలో కీలక మైలురాయిగా నిలవనుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి. మణి మంజరి సాగర్, బీసీ జేఏసీ కో-చైర్మన్ పిట్ల శ్రీధర్, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరస్వామి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, ఎం. చంద్రశేఖర్ గౌడ్, దీటి మల్లయ్య, డాక్టర్ రమ, జాజుల లింగన్ గౌడ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, టీ. నందగోపాల్, తారకేశ్వరి, కౌలె జగన్నాథం, స్వర్ణ గౌడ్, సమతా యాదవ్, సంధ్యారాణి, బూడిద మల్లికార్జున యాదవ్, డాక్టర్ రమేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# రంగధాముని చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్







(ఆగస్టు 4 హంస కలం వార్త)

చెరువు అభివృద్ధి, బతుకమ్మ -- వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రంగధాముని చెరువు ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, రాబోయే బతుకమ్మ మరియు వినాయక చవితి పండుగల సందర్భంగా రంగధాముని చెరువు వద్ద భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు, గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. అలాగే, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు 10 ఎకరాల భూమిని వాటర్ వర్క్స్ మరియు విద్యుత్ శాఖలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆ ప్రాంతంలో నివాస కాలనీలు వేగంగా విస్తరిస్తున్నందున ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, రంగధాముని చెరువు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, పోలీసు అధికారులు, హైడ్రా అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తారాస్థాయికి చేరిన అవినీతి.. ఆరు నెలల్లోనే 2025 రికార్డును దాటేసిన ఏసీబీ కేసులు

ఆగస్టు 4 హంసకలం వార్త



మూడేళ్ల క్రితం వరకు తలసరి ఆదాయం, ధాన్యం ఉత్పత్తి, ఐటీ ఎగుమతులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్, గ్రామీణా భివృద్ధి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల స్థాపన వంటి రంగాల్లో రికార్డులు సృష్టించిన తెలంగాణ రాష్ట్రం.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రం నేరాలు, మద్యం అమ్మకాలు, అవినీతి అంశాల్లో టాప్ ర్యాంక్ సాధించి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తోందని బీఆర్ఎస్ విమర్శించింది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రుల స్థాయిలో అవినీతి పెరగడంతో, అదే కిందిస్థాయి అధికారుల నుంచి చిరుద్యోగుల వరకు విస్తరించిందని ఆరోపించింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రోజూ ఎక్కడో ఒకచోట అవినీతి అధికారులను ట్రాప్ చేసి పట్టుకుంటున్నప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడం లేదని, ప్రతి ఏడాది ఏసీబీ కేసుల సంఖ్య పెరుగుతుండటం తెలంగాణలో పెచ్చరిల్లుతున్న అవినీతికి నిదర్శనమని పేర్కొంది. 2025 సంవత్సరం మొత్తం నమోదైన ఏసీబీ కేసుల సంఖ్యను 2026లో కేవలం ఆరు నెలల్లోనే అధిగమించడం కాంగ్రెస్ పాలనలో అవినీతి ఎంతగా పెరిగిందో తెలియజేస్తోందని విమర్శించింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్, మున్సిపల్ శాఖలు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిధిలోని రెవెన్యూ శాఖ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిధిలోని ఆర్థిక శాఖల్లో అవినీతి అధికంగా ఉందని ఆరోపించింది. దీన్ని బట్టి పైస్థాయిలో పరిపాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని బీఆర్ఎస్ పేర్కొంది.

## ఆగస్టు 10లోగా అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పూర్తి చేయాలి: డైరెక్టర్ శృతి ఓజా






(ఆగస్టు 5 హంస కలంవార్త )

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుదీకరణ పనులను ఈ నెల 10వ తేదీలోగా పూర్తిచేయాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా, ఐఏఎస్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, డైరెక్టర్ వి. మోహన్ రావు, చీఫ్ ఇంజినీర్ సురేందర్, ఆదిలాబాద్, నిజామాబాద్, జనగామ, ఖమ్మం, ములుగు, రాజన్న సిరిసిల్ల సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డి.ఈ. కన్స్ట్రక్షన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. డైరెక్టర్ శృతి ఓజా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంలో టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు వేగంగా పనిచేస్తున్న ందుకు అభినందించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న కేంద్రాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్క అంగన్‌వాడీ కేంద్రం కూడా మిగలకుండా జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని విద్యుదీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి ఆగస్టు 10లోగా అన్ని పెండింగ్ పనులను పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. అవసరమైన మెటీరియల్, మీటర్లు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించాలని కూడా సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, చీఫ్ ఇంజినీర్ సురేందర్, డివిజినల్ ఇంజినీర్ మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# నిరుపేదలకు అన్యాయం చేయొద్దు.. నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వండి- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు







ఆగస్టు 4 హంస కలం వార్త )

కైతలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కైతలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అధికారులతో సమీక్ష నిర్వహి ంచారు. అపార్ట్‌మెంట్‌ల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాల కింద నిర్మించిన షట్టర్ల వ్యవహారంపై ఎమ్మెల్యే ప్రశ్నలు లేవనెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆ షట్టర్లను అపార్ట్‌మెంట్‌లలో నివసించే లబ్ధిదారులకు కేటాయి ంచి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని అపార్ట్ మెంట్ నిర్వహణకు వినియోగించాలని జీవో జారీ చేశామని గుర్తు చేశారు. అలాంటి జీవోను పక్కనపెట్టి షట్టర్లను రూ.20 లక్షలకు విక్రయించడం ఏంటని అధికారు లను ప్రశ్నించారు. అలాగే కైతలాపూర్‌కు చెందిన నిరుపేదలకు కాకుండా ఇతర జిల్లాల వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించారనే ఆరోపణలను ప్రస్తావిస్తూ, నిజమైన అర్హులకే ఇళ్లు అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. స్థానికంగా దాదాపు 87 మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారని, వారికి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక నిరుపేదలకు న్యాయం జరగకపోతే రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే నిరుపేదల కోసం ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి వారి తరఫున విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కంటే ప్రభుత్వ స్థలాలను వేలం వేసి విక్రయించడంపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే పార్కులు, ఇండోర్ స్టేడియంలు వంటి ప్రజా ప్రయోజనాల నిర్మాణాలు చేపట్టామని, ప్రభుత్వ స్థలాలను విక్రయి ంచిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలపై దృష్టి సారించి, నిరుపేదల పక్షాన నిలబడి వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిం చాలని కోరారు. స్థానికులు రహదారి సౌకర్యం కల్పిం చాలని కోరగా, వెంటనే ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, సంతోష్, కల్యాణ్, కృష్ణ, అశ్విన్, వాటర్ వర్క్స్, హౌసింగ్ బోర్డు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షల ఆర్థిక సహాయం అందజేత







( ఆగస్టు 4 హంస కలంవార్త )

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పర్వదినం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయాలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30,71,000 ఆర్థిక సహాయాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆలయ ధర్మకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలను సమానంగా గౌరవిస్తు న్నారని, ఈ ఏడాది బోనాల ఉత్సవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షలు మంజూ రయ్యాయని పేర్కొన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశు ద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు తదితర అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అన్నారు. ప్రతి భక్తుడు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాల్లో పాల్గొనేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు బోనాల ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు దోహదపడతాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆలయ ధర్మకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేటలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్.. ఆక్రమణల తొలగింపు, కేసుల నమోదు

( ఆగస్టు 5 హంస కలంవార్త )

హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ శ్రీ డి. జోయల్ డేవిస్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అమీర్‌పేట ప్రధాన రహదారిలో రోప్ (రిమోవల్ అఫ్ అబ్స్ట్రక్టివ్ పార్కింగ్ ఢ ఎంక్రోచ్ మెంట్స్ ) ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ ట్రాఫిక్-1 అదనపు డీసీపీ ఎ. రాములు, ఖైరతాబాద్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్. మోహన్ కుమార్ పర్యవేక్షించగా, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)తో పాటు సిబ్బంది ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఫుట్‌పా త్‌లు, కాజ్‌వేలను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలు, ఇతర అడ్డంకులను తొలగిం చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనాలను









కూడా తొలగించి, కాలినడకన వెళ్లే వారికి సౌకర్యం కల్పించడంతో పాటు వాహనాల రాకపోకలను సులభతరం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నగరం లోని అన్ని రహదారులను ఆక్రమణలు లేకుండా, సురక్షితంగా ఉంచేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు కొనసాగిస్తారని అధికారులు స్పష్టం చేశారు.

## పెట్రోలియం పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరు



(ఆగస్టు 5 హంస కలంవార్త)



పెట్రోలియం, సహజవాయువు సంబంధిత పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశం బుధవారం సాయంత్రం పార్లమెంట్ అనెక్స్ భవనంలో జరిగింది. స్థాయీ సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు కమిటీ సభ్యులు, వివిధ చమురు సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశంలో దేశంలో ప్రస్తుతం ఉన్న క్రూడాయిల్, సహజవాయువు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వలపై సమీక్ష నిర్వహించారు. అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఇంధన సరఫరాపై చూపే ప్రభావం, ధరల హెచ్చుతగ్గులు, వాటి నియంత్రణ, స్థిరీకరణ, ఇంధన కల్తీ నివారణ, ప్రమాదాల నివారణ, వ్యర్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, వినియోగదారులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు చమురు సంస్థల అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సేవల నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. ఇంధన పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు.

## మియాపూర్ జంక్షన్‌ను సందర్శించిన డీసీపీ శేషాద్రిని రెడ్డి.. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నిర్వహణపై కీలక ఆదేశాలు




( ఆగస్టు 5 హంస కలంవార్త)

డీసీపీ ట్రాఫిక్--II శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, బుధవారం మియాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీతో కలిసి మియాపూర్ జంక్షన్‌ను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ శేషాద్రిని రెడ్డి పాదచారులతో నేరుగా మాట్లాడి, జీబ్రా క్రాసింగ్, పాదచారుల సిగ్నల్స్, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ సురక్షితంగా రహదారిని దాటాలని అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్ల సంభవించే ప్రమాదాలు, ప్రాణనష్టం వంటి తీవ్ర పరిణామాలపై వివరించి, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం మియాపూర్ జంక్షన్‌లో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన ముందస్తు పనులను, ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన అదనపు (ఎక్స్‌ట్రా) లేన్ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. నిర్మాణ పనుల వల్ల ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అల్విన్ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్ సౌకర్యాన్ని పరిశీలించిన డీసీపీ, వాహనదారులకు స్పష్టమైన అవగాహన కల్పించేలా "ఫ్రీ లెఫ్ట్ అహడ్ ", "ఫ్రీ లెఫ్ట్ -- ఫైన్ ఫర్ విఓలేషన్ " హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అడ్డుకునే వాహనదారులపై మోటార్ వెహికిల్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేసి నేరుగా వెళ్లేందుకు ప్రయత్నించే వాహనాలను అనుమతించకుండా, ఫ్రీ లెఫ్ట్ మార్గం ద్వారానే వెళ్లి తదుపరి యూ-టర్న్ వరకు ప్రయాణించేలా ట్రాఫిక్‌ను నియంత్రించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ, ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిర్వహణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# తమ్మిడికుంట చెరువు అభివృద్ధిపై పీఏసీ చైర్మన్ ఆర్కెపూడి గాంధీ సమీక్ష"






(ఆగస్టు 4 హంస కలంవార్త )

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ, అభివృద్ధి పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ మరియు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు ఆక్రమణలను తొలగించి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి చర్యలు చేపట్టామని, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుని చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షిస్తున్నామని తెలిపారు. నాలాల పునరుద్ధరణ, చెరువు కట్ట బలోపేతం, అలుగు మరమ్మతులు, మురుగు నీరు చెరువులోకి హెడ్డింగ్చే హెడ్డింగ్ర కుండా ప్రత్యేక యూజీడీ ( యు జి డి ) మళ్లింపు పైప్‌లైన్ నిర్మాణం, ఎస్టీపీ ( ఎస్ టి పి ) ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, హరితవనం, సుందరీకరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. చెరువులో కలుషిత నీరు చేరకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, తామర పూల పెంపకంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. నియోజకవ ర్గంలోని అన్ని చెరువులను దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చెరువులను కబ్జాల నుంచి శాశ్వతంగా రక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జంగయ్య యాదవ్, రామచందర్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుంది కూకట్‌పల్లి ఎమ్మెల్యే తీరు: కాంగ్రెస్ నేతలు





( ఆగస్టు 4 హంస కలంవార్త )

డబుల్ బెడ్‌రూమ్ కేటాయింపుపై యాగీ.. యాగీ..! పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అంశంపై ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రజల్లో నవ్వులపాలయ్యారని ఎద్దేవా చేశారు. 144 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో గతంలో లావాదేవీలు, బేరసారాలు ఎవరు చేశారో కూకట్‌పల్లి ప్రజలకు బాగా తెలుసని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిజమైన పేదలను గుర్తించి పారదర్శకంగా ఇళ్లను పంపిణీ చేశామని తెలిపారు. ఎక్కువ శాతం ఇళ్లు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పేద లంబాడీ కుటుంబాలకు కేటాయించిన విషయం ఎమ్మెల్యేకు తెలియదా అని ప్రశ్నించారు. కూకట్‌పల్లిలో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఉపాధి కోసం వచ్చి స్థిరపడిన కుటుంబాలు ఉన్నాయని, వారిలో అర్హులైన పేదలను గుర్తించి రాష్ట్ర మంత్రుల సిఫారసులతో ఇళ్లు కేటాయిస్తే దానిని కూడా ఎమ్మెల్యే జీర్ణించుకోలే కపోతున్నారని విమర్శించారు. "ఖమ్మం ఏమన్నా పాకిస్తాన్‌లో ఉందా? రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ తెలంగాణలో లేవా? పేదలకు ఇళ్లు ఇస్తే ఇంత కడుపుమంట ఎందుకు?" అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎమ్మెల్యే చేసిన అక్రమాలపై తమ వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని, కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేకే మాధవరం కృష్ణారావు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# మూసాపేట్‌లో మోదీ--షా ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ స్టిక్కర్ ప్రచారం





(ఆగస్టు 5 హంస కలంవార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గం: తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్ పిలుపు మేరకు, కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం ఆధ్వర్యంలో మూసాపేట్ మెట్రో స్టేషన్ ప్రాంతంలో కేంద్రంలోని మోదీ--షా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శాంతియుతంగా స్టిక్కర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజల గొంతుకను అణచివేయడం సాధ్యం కాదని, ప్రజల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎండి ఆరిఫ్, ఎండి సల్మాన్, మూసాపేట్ డివిజన్ అధ్యక్షుడు ఎండి ఆమేర్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కళ్యాణ్, కైతలాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎండి సుల్తాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బోనాల పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి..



( ఆగస్టు 4 హంస కలంవార్త )

పట్టణంలో ఈ నెల 16వ తేదీ ఆదివారం నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ ఊర ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని ప్రజలందరూ ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ ఊర ముత్యాలమ్మ బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎలాంటి వేధింపులు లేదా అసభ్యకర ఘటనలు చోటుచేసుకోకుండా షీ టీమ్స్ ప్రత్యేకంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు.భక్తులందరూ పరస్పర సహకారంతో, ఆనందోత్సాహాల మధ్య శ్రీ ఊర ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను విజయవంతం చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, పట్టణ ఎస్సై సందీప్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కోడి శిరీష శివ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ముస్కు రామచంద్రారెడ్డి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతమళ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి,ఆలయ కమిటీ అధ్యక్షులు రాములు, మాజీ కౌన్సిలర్ గుంటి సైదులు భానురేఖ,25వ వార్డు కాంగ్రెస్ నాయకులు యాట వెంకటేశ్వర్లు, కోల నాగరాజు, శ్రీ శ్రీ శ్రీ ఊర ముత్యాలమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, జమండ్ల సత్యనారాయణ రెడ్డి, పడిదల రవి, గుణగంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివి మంచి ఉత్తీర్ణులు కావాలి

-ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

( ఆగస్టు 4 హంస కలంవార్త )



ధైర్యం, క్రమశిక్షణ, లక్ష్యసాధనతో విద్యార్థులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం ఆలేరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో దిన శరణ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మరియు కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆరు గ్యారంటీలను ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకువస్తూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. విజయం సాధించాలంటే కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగితే ఏ రంగంలోనైనా అత్యున్నత విజయాలు సాధించవచ్చని అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలని హితవు పలికారు.అనంతరం ఇటీవల వివిధ పోటీ పరీక్షలు, విద్యా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించి వారికి ప్రతిభా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిపుణులు విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలు, కెరీర్ ఎంపికపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ అభిరుచి, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దిన శరణ్య సంస్థ ప్రతినిధులు చింతల సాయిబాబా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## 2028 నాటికి పాలిమర్ నోట్లు తీసుకురావడమే లక్ష్యం: ఆర్‌బీఐ



భారత్‌లో పాలిమర్ కరెన్సీ నోట్లను 2028 ఆర్థిక సంవత్సరం నాటికి చలామణిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం పాలిమర్ నోట్లపై క్షేత్రస్థాయి పరీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన మల్హోత్రా.. మార్కెట్‌లోకి తీసుకొచ్చే ముందు పాలిమర్ నోట్ల పనితీరును పూర్తిగా పరిశీలిస్తామని వెల్లడించారు. ఫలితాలను విశ్లేషించిన తర్వాతే విస్తృత స్థాయిలో చలామణిపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల రూ.10, రూ.20 విలువైన పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి పరీక్షలకు ఆర్‌బీఐ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఒక్కో విలువలో 100 కోట్ల నోట్లు విడుదల చేసి వాటి మన్నిక, భారత వాతావరణ పరిస్థితులకు అనుకూలతను పరిశీలించనున్నారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువకాలం మన్నుతాయని ఆర్‌బీఐ పేర్కొంది. వీటిలో పారదర్శక విండోలు, అధునాతన భద్రతా ఫీచర్లు ఉండటంతో నకిలీ నోట్లను అరికట్టడంలో కూడా ఉపయోగపడతాయని తెలిపింది. అయితే ప్రస్తుతం కాగితపు నోట్లను పూర్తిగా తొలగించే ప్రతిపాదన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్లు ప్రవేశపెడితే అవి ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లతో పాటు చలామణిలో కొనసాగనున్నాయి.

## ఎయిర్‌టెల్ రూ.299 రీఛార్జ్ ప్లాన్‌కు గుడ్‌బై.. ఇక రూ.349 నుంచే అన్‌లిమిటెడ్ ప్లాన్లు




ఎయిర్‌టెల్ తన అత్యంత చవక అన్‌లిమిటెడ్ ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ అయిన రూ.299 ప్యాక్‌ను నిలిపివేసింది. ఈ ప్లాన్‌ను కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ నుంచి కూడా తొలగించింది. దీంతో ఇకపై రూ.349 ప్లాన్ ఎయిర్‌టెల్‌లో అత్యంత తక్కువ ధరలో లభించే అన్‌లిమిటెడ్ ప్రీపెయిడ్ ప్లాన్‌గా మారింది.గతంలో రూ.299 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1GB డేటా, అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్‌టీడీ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, ఉచిత కాలర్ ట్యూన్స్, పర్‌ప్లెక్సిటీ ప్రో ఏఐ సబ్‌స్క్రిప్షన్ వంటి ప్రయోజనాలు ఉండేవి.ఇప్పుడు అందుబాటులో ఉన్న రూ.349 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 2+దీ హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. అదనంగా 6 నెలల యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్, ఉచిత ఎయిర్‌టెల్ హలో ట్యూన్స్, 12 నెలల అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా అందిస్తోంది.అలాగే రూ.399 ప్లాన్‌లో రోజుకు 2.5+దీ డేటాతో పాటు 28 రోజుల జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తోంది.ఎయిర్‌టెల్ రూ.579, రూ.619 ప్రీపెయిడ్ ప్లాన్‌లను కూడా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సర్కిళ్లలో నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు ప్లాన్‌లు ప్రస్తుతం ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్‌లో ఇంకా కనిపిస్తున్నాయి. కాబట్టి వాటి నిలిపివేతపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు- ఆర్‌బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అంశంపై ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే దాని నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనని, అయితే ఆ భారం నేరుగా సాధారణ వినియోగదారులపైనే పడుతుందని ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐపై ఎండీఆర్ అంశం ఇంకా ప్రారంభ దశలోనే ఉందన్నారు. ప్రభుత్వం చట్ట సవరణ ప్రక్రియలో ఉందని, తుది నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని చెప్పారు. "వ్యవస్థ నిర్వహణకు ఖర్చు తప్పదు. ఆ ఖర్చును ఎవరో ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అది సాధారణ వినియోగదారుడే చెల్లిస్తాడని చెప్పలేం. పరోక్షంగా ఆర్థిక వ్యవస్థలోనే ఆ వ్యయం భరించే అవకాశం కూడా ఉంటుంది" అని మల్హోత్రా వివరించారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్' చట్ట సవరణ బిల్లు ద్వారా యూపీఐ, రూపే వంటి డిజిటల్ చెల్లింపులపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశానికి చట్టపరమైన వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం నోటిఫై చేసిన డిజిటల్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు లేదా చెల్లింపు సేవల సంస్థలు ఎండీఆర్ వసూలు చేయలేవు. ప్రతిపాదిత సవరణ అమల్లోకి వస్తే ఏ చెల్లింపు విధానాలకు ఛార్జీలు ఉండాలి, వేటికి మినహాయింపు ఇవ్వాలి అనే విషయాన్ని ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే అవకాశం ఉంటుంది. అయితే రోజువారీ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. రూ.2,000కు పైబడిన వ్యాపార చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారని, పాలు, కూరగాయలు, కిరాణా వంటి చిన్న మొత్తాల యూపీఐ చెల్లింపులు యథాతథంగా ఉచితంగానే కొనసాగే అవకాశముందని తెలిపాయి. ప్రస్తుతం క్రెడిట్, డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్ అమల్లో ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో ఆ వ్యయాన్ని వ్యాపారులే భరిస్తున్నారు. యూపీఐ విషయంలో కూడా తుది విధానం ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆర్‌బీఐ కూడా ప్రస్తుతం ఎలాంటి అధికారిక ప్రతిపాదనను ప్రకటించలేదని గవర్నర్ స్పష్టం చేశారు.

## కామన్వెల్త్ గేమ్స్‌లో కలకలం.. గ్లాస్గోలో పాకిస్థాన్ స్టార్ బాక్సర్ కుద్రతుల్లా అదృశ్యం!

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఇటీవలే ముగిసిన కామన్వెల్త్ గేమ్స్-2026 వేదికగా ఒక షాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన స్టార్ బాక్సర్ కుద్రతుల్లా గేమ్స్ విలేజ్ నుంచి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. టోర్నీ ముగిసి పాకిస్థాన్ జట్టులోని ఇతర అథ్లెట్లు, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడం పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్)కు తీవ్ర అవమానకరమైన పరిస్థితిగా మారింది.

**అసలేం జరిగింది?**

కుద్రతుల్లా 57 కేజీల ఫెదర్‌వెయిట్ విభాగంలో పాకిస్థాన్ తరఫున కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. అయితే క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైన తర్వాత, ఆగస్టు 2న గేమ్స్ ముగిసి జట్టు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్న సమయంలో ఆయన ఎవరికీ చెప్పకుండా గ్లాస్గోలోని తన గది నుంచి కనిపించకుండా పోయాడు.

జట్టు మేనేజర్, అధికారులు ఆయన గదిని పరిశీలించగా.. తన పాస్‌పోర్ట్, ప్రయాణ పత్రాలు, ఇతర విలువైన సామగ్రితో పాటు ఆయన పరారైనట్లు నిర్ధారణ అయింది. కేవలం మాతృదేశానికి వెళ్లే ఎయిర్ టికెట్లను మాత్రమే గదిలోని టేబుల్‌పై వదిలేసి వెళ్లాడని పాక్ క్రీడా వర్గాలు వెల్లడించారు.

**పాకిస్థాన్ బాక్సింగ్ బోర్డు ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు!**




ఈ ఘటనపై పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం అథ్లెట్ల పాస్‌పోర్ట్‌లు అధికారుల వద్దే ఉండాలి. కానీ ప్రయాణ విమాన టికెట్ల నమోదు ప్రక్రియ కోసం పాస్‌పోర్ట్ అందుకున్న కుద్రతుల్లా, ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని గ్లాస్గో నుంచి కనిపించకుండా పోయాడని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఉదంతంపై గ్లాస్గో స్థానిక పోలీసులకు, కామన్వెల్త్ గేమ్స్ నిర్వాహకులకు పీబీఎఫ్, పాక్ కాన్సులేట్ అధికారులు అధికారికంగా ఫిర్యాదు చేశారు. అలాగే, ఆయనపై తీవ్ర క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు పాకిస్థాన్‌లో ఒక ప్రత్యేక విచారణ కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

**పాక్ అథ్లెట్లకు ఇది కొత్త కాదు!**

అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శన కోసం వెళ్లి పాకిస్థాన్ క్రీడాకారులు ఇలా మాయమవ్వడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా బ్రిటన్, జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లో జరిగిన క్రీడా పోటీలకు వెళ్లిన పలువురు పాక్ బాక్సర్లు, ఈతగాళ్ళు మాతృదేశానికి తిరిగి రాకుండా యూరప్‌లోనే అక్రమంగా ఉండిపోవడం లేదా శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకోవడం వంటి ఘటనలు వెలుగుచూశాయి. పాకిస్థాన్‌లో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం లభించకపోవడం, భవిష్యత్తుపై అభద్రతాభావం వల్లే అథ్లెట్లు ఇలాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లాస్గో పోలీసులు బ్రిటన్ అంతటా కుద్రతుల్లా కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## అజిత్ అగార్కర్ మార్పు తప్పదా? అతడి స్థానంలో మరో మాజీ స్టార్ ప్లేయర్!





భారత క్రికెట్‌లో మరో కీలక మార్పుకు రంగం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. జట్టు ఎంపిక బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది. ఆయన స్థానంలో భారత మాజీ స్టార్ వీవీఎస్ లక్ష్మణ్‌ను తీసుకురావాలని బీసీసీఐ పెద్దలు ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రోహిత్ శర్మ భవిష్యత్తు చుట్టూ జరిగిన పరిణామాలు కూడా ఈ చర్చకు బలం చేకూర్చినట్టు తెలుస్తోంది.బీసీసీఐ ప్రధాన ఎంపిక కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ ఒప్పందం జూన్ 2026తో ముగిసింది. ఆ తర్వాత బోర్డు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆయన కొనసాగుతారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా కొత్త ముఖాన్ని తీసుకురావాలనే ఆలోచన సాగుతున్నట్టు సమాచా రం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ రోహిత్ శర్మకు చివరిదని ముందుగా ప్రచారం జరిగింది. ఆ తర్వాతి సిరీస్‌లకు అతణ్ని పక్కన పెట్టే అంశంపై అగార్కర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యంతో చర్చించినట్టు కథనాలు వెలువడ్డాయి.అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు ముందు అదే రోహిత్ చివరి మ్యాచ్ అవుతుందనే వార్త బయటకు వచ్చింది. ఆ మ్యాచ్‌లో రోహిత్ సెంచరీతో మెరవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఎంపిక కమిటీపై ఒత్తిడి పెరిగినట్టు చెబుతున్నారు. లార్డ్స్ వన్డే తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టమైన ప్రకటన చేశారు. రోహిత్ ఇంకా జట్టు ప్రణాళికల్లో భాగమేనని చెప్పారు. అతడు ఇంకా కొంత కాలం భారత జట్టుకు ఆడతాడని వెల్లడించారు. ఈ ప్రకటనకు ముందు అగార్కర్‌తో సంప్రదింపులు జరగలేదని కూడా వార్తలు వచ్చాయి.

# స్పోర్ట్స్

## ఇంగ్లాండ్ పౌరసత్వం పొందిన పాక్ క్రికెటర్ ఆమిర్ ఐపీఎల్ 2027లో ఆడటంపై కీలక వ్యాఖ్యలు!




పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లాండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ (IPL)లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లాండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లాండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.

# వేధించే వారి అకౌంట్లు ట్యాగ్ చేయండి

## నెటిజన్లకు మృణాల్ ఠాకూర్ పిలుపు

డీప్‌ఫేక్ కంటెంట్‌ను దుర్వినియోగం చేయడంపై ఇటీవలే తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఆన్‌లైన్ వేధింపులపై మరో ముందడుగు వేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయాలని నెటిజన్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించే, కృత్రిమ మేధ (ఏఐ) సాయం తో సృష్టించిన లేదా అంగీకారం లేకుండా తీసిన వ్యక్తిగత చిత్రాలను పంచుకునే అకౌంట్ల వివరాలను ట్యాగ్ చేయాలని మృణాల్ కోరారు. "ఇంట ర్నెట్‌లోని ఈ మేధావుల కోసం ఓ 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్మిద్దాం. వేధించే ఖాతాలను గుర్తిస్తే, వాటిని ట్యాగ్ చేయండి. ఇలాంటివి డాక్యుమెంట్ చేయడం చాలా అవసరం" అని తన పోస్టులో పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితమే డీప్‌ఫేక్‌పై మృణాల్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. "నా ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టించడం లేదా పంచు కోవడం చట్టవిరుద్ధం, ఆమోదయోగ్యం కాదు. దీన్ని అధికారిక హెచ్చరికగా భావిం చండి. నా గుర్తింపును ఇంకెవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. ఇక మృణాల్ కెరీర్ విషయానికొస్తే, ఆమె చివరిగా డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంలో వరుణ్ ధావన్, పూజా హెగ్డేలతో కలిసి నటించారు. ప్రస్తుతం ఆమె సౌత్ ఇండియాలో ఓ భారీ ప్రాజెక్టులో భాగమయ్యారు. అట్లీ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలలో నటిస్తున్న 'రాకా'



చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఇటీవల విడుదలైన 'రాకా' ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ గుండుతో, తోడేలు పంజా ముఖానికి అడ్డుగా ఉన్న ఇంటెన్స్ లుక్‌లో కనిపించి సినిమాపై అంచనాలను పెంచారు.

### రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు. అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.





### ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?

కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది. 2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది.



## 'కరికాల'గా సందీప్ కిషన్.. రెండు భాగాలుగా భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం!

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన కథానాయకుడిగా 'కరికాల' అనే టైటిల్‌తో ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ రాజసం ఉట్టిపడే అవతారంలో కనిపించారు. ఓ అడవిలో గుర్రంపై కూర్చుని, చేతిలో పదునైన కత్తి పట్టుకుని శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. పక్కనే సింహంతో అతడి గంభీరమైన లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఒక ఫాంటసీ చిత్రమని, భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్‌తో దీన్ని రూపొంది స్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. చాప్టర్-1ను 2027 జూలై 2న, చాప్టర్-2ను అదే ఏడాది అక్టోబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం 'సిగ్మా' అనే మరో చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలై 31న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు 'కరికాల' ప్రకటనతో సందీప్




తన కెరీర్‌లోనే ఓ భారీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449